సైన్స్ డే వేడుకలు

మేడ్చల్ రూరల్: మండలంలోని పూడూర్ గ్రామంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సైన్స్ డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. సెహగల్ ఫౌండేషన్ సహకారంతో నిర్వహించిన వేడుకల్లో మండలంలోని నూతన్‌కల్, రాజబొల్లారం, రావల్‌కోల్, మేడ్చల్, శ్రీరంగవరం, మెదక్ జిల్లా వడియారం గ్రామ ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు పెద్ద ఎత్తున పాల్గొని తమ ప్రయోగాలను ప్రదర్శించారు. సెహగల్ ఫౌండేషన్ ప్రతినిధి శృతి సింగ్ ముఖ్య అతిథిగా పాల్గొని విద్యార్థుల ప్రదర్శనలను తిలకించారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఉత్తమ విద్యార్థులకు బహుమతులు ప్రధానం చేశారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం శంకరయ్య, సైన్స్ టీచర్ మధుసుదన్‌రెడ్డి, ఉపాధ్యాయులు,విద్యార్థులు పాల్గొన్నారు.

అత్వెల్లిలోని పాఠశాలలో ఉపాధ్యాయులు ఉత్సాహంగా సైన్స్ ఫేర్‌ను నిర్వహింప చేశారు.


అత్వెల్లి ఉన్నత పాఠశాలలో విద్యార్థుల సైన్స్ ఫేర్


విద్యార్థుల ప్రయోగాలను పరిశీలిస్తున్న సెహగల్ ఫౌండేషన్ ప్రతినిధి శృతి సింగ్, ఉపాధ్యాయులు

ఘనంగా మలికార్జునస్వామి ప్రతిష్ఠా మహోత్సవం



కీసర: చీర్యాల లక్ష్మీనృసింహ స్వామి దేవస్థానంలో శ్రీగంగా భ్రమరాంబిక సమేత మల్లికార్జున స్వామి ప్రతిష్ఠా మహోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. బుధవారం నిర్వహించిన ప్రతిష్ఠా మహోత్సవంలో మల్కాజిగిరి ఎమ్మెల్యే రాజశేఖర్‌రెడ్డి, జడ్పీ చైర్మన్ శరత్ చంద్రారెడ్డి, ఎమ్మెల్సీ బసవరాజ్ సారయ్య, సినీ నటుడు, మాజీ మంత్రి బాబుమోహన్ హాజరయ్యారు. ఆలయ చైర్మన్ మల్లారపు లక్ష్మీనారాయణ, ధర్మకర్త శ్రీహరి వేదపండితులతో కలిసి పూర్ణకుంభంతో స్వాగతం పలికారు.

మైనర్ బాలిక నిశ్చితార్థాన్ని అడ్డుకున్న అధికారులు

మేడ్చల్ రూరల్: మైనర్ బాలికకు వివాహం జరిపేందుకు నిశ్చయించి నిశ్చితార్థం కార్యక్రమాన్ని జరిపేందుకు ఏర్పాట్లు చేయగా సమాచారం అందుకున్న చైల్డ్ హెల్ప్‌లైన్ అధికారులు, మేడ్చల్ పోలీసులు నిశ్చితార్థాన్ని అడ్డుకున్నారు. ఈ సంఘటన మండలంలోని రావల్‌కోల్ గ్రామంలో గత ఆదివారం చోటు చేసుకోగా ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. రావల్‌కోల్ గ్రామానికి చెందిన ఓ బాలిక (15) పదవ తరగతి చదవుతుంది. తమ కూతురి వివాహం జరపాలని భావించిన బాలిక తల్లిదండ్రులు నగరంలోని మూసాపేట్‌కు చెందిన 25 ఏళ్ల యువకుడితో వివాహం జరిపేందుకు ఇరు కుటుంబాలు నిశ్చయించుకున్నాయి. ఈ మేరకు గత ఆదివారం వివాహ పత్రిక రాసుకుని నిశ్చయ తాంబూలాలు మార్చుకునేందుకు ఏర్పాట్లు చేశారు. విషయం తెలుసుకున్న చైల్డ్ హెల్ప్‌లైన్ అధికారులు మేడ్చల్ పోలీసులతొ కలిసి అడ్డుకున్నారు. బాలిక తల్లిదండ్రులకు బాల్యవివాహం వల్ల జరిగే అనర్థాలు వివరించి తమ కూతురికి 18 ఏళ్లు నిండే వరకు పెళ్లి జరిపించమనే అండర్ టేకింగ్ పత్రంపై తల్లిదండ్రులతో సంతకం చేయించుకున్నారు.

'దమ్మాయిగూడ' బడ్జెట్ రూ. 23.35 కోట్లు


బడ్జెట్ సమావేశంలో మాట్లాడుతున్న చైర్ పర్సన్ వసుపతి ప్రణీత

కీసర: దమ్మాయిగూడ పురపాలక సంఘం అంచనా బడ్జెట్‌ను పాలకవర్గం ఏకగ్రీవంగా ఆమోదించినట్లు చైర్ పర్సన్ వసుపతి ప్రణీత శ్రీకాంత్ గౌడ్ తెలిపారు. బుధవారం మున్సిపల్ ఆఫీస్‌లో ప్రణీత అధ్యక్షతన బడ్జెట్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. 2024–25 ఆర్థిక సంవత్సరానికి ప్రవేశపెట్టిన రూ. 23.35 కోట్ల అంచనా బడ్జెట్‌ను కౌన్సిల్ ఆమోదిస్తూ తీర్మానం చేసిందన్నారు. ఇందులో పన్నుల ద్వారా రూ. 22.77 కోట్లు, నిర్మాణ అనుమతుల ద్వారా రూ. 8.20 కోట్ల ఆదాయం వస్తుందన్నారు. అభివృద్ధి, ఇతర ఖర్చుల కోసం రూ. 22.77 కోట్లతో అంచనా వ్యయాన్ని రూపొందించామన్నారు. సమావేశంలో వైస్ చైర్మన్ మాదిరెడ్డి నరేందర్‌రెడ్డి, కమిషనర్ రాజమల్లయ్య, డీఈఈ చిరంజీవులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా ఇంటర్ పరీక్షలు ప్రారంభం


ఘట్‌కేసర్ శ్రీ చైతన్య కళాశాల వద్ద విద్యార్థుల సందడి

మేడ్చల్: ఇంటర్మీడీయట్ పరీక్షలు మేడ్చల్ లో మొదటి రోజు ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. మేడ్చల్ పట్టణంలో ఆరు పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేసి 1974 మంది విద్యార్థులు పరీక్షలు రాసేందుకు కేటాయించారు. తొలిరోజు ఆరు సెంటర్‌లలో 1903 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 71మంది విద్యార్థులు పరీక్షలకు గైర్హాజరయ్యారని అధికారులు తెలిపారు. పరీక్షలు తొలిరోజు కావడం ఆలస్యమైతే అనుమతి లేదని నిభంధనల ఉండటంతో పరీక్షా కేంద్రాల వద్ద విద్యార్థుల హడావుడి ఉదయం నుండి కనబడింది.


స్ఫూర్తి కళాశాల కేంద్రం వద్ద విద్యార్థుల హడావుడి

ఘట్‌కేసర్‌లో..

ఘట్‌కేసర్: ఇంటర్మీడియట్ పరీక్షలు గురువారం ప్రారంభమయ్యాయి. పట్టణంలోని రిషి జూనియర్ కళాశాలలో 401 మంది విద్యార్థులను కేటాయించగా ముగ్గురు, శ్రీ చైతన్య జూనియర్ కళాశాలలో 545 మందిని కేటాయించగా ఏడుగురు, అవుషాపూర్ శ్రీ చైత్యన్య కళాశాలలో 486 మందిని కేటాయించగా 34 మంది, ఆల్‌ఫోర్స్ కళాశాలలో 583 మందిని కేటాయించగా 17 మంది విద్యార్థులు గైర్హాజరు అయ్యారు. ఆయా పరీక్ష కేంద్రాల వద్ద సీఐ గోవర్ధనగిరి తన సిబ్బందితో భద్రత ఏర్పాటు చేశారు.

శామీర్‌పేట్‌లో:

శామీర్‌పేట్: ఇంటర్ విద్యార్థుల మొదటి రోజు పరీక్ష (బుధవారం) ప్రశాంతంగా జరిగింది. ఉమ్మడి శామీర్‌పేట మండలంలో మొత్తం నాలుగు సెంటర్లలో ఇంటర్ మొదటి సంవత్సర పరీక్షలు నిర్వహించగా 1274 మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కావలసి ఉండగా 1238 మంది హాజరు కాగా 36 మంది గైర్హాజరయ్యారని అధికారులు తెలిపారు.

మౌలిక వసతులు కల్పిస్తాం : ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి

మల్లాపూర్: డివిజన్ పరిధిలో అన్ని కాలనీల్లో మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తున్నామని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అన్నారు. మల్లాపూర్ డివిజన్ పరిధిలో రూ.1.76 కోట్ల వ్యయంతో చేపట్టనున్న అభివృద్ధి పనులకు స్థానిక కార్పొరేటర్ పన్నాల దేవేందర్‌రెడ్డితో కలిసి ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి బుధవారం శంకుస్థాపన చేశారు. నెహ్రూనగర్‌లో రూ.1.20 కోట్ల వ్యయంతో చేపట్టనున్న సీసీ రోడ్లు, అశోక్‌నగర్‌లో భూగర్భ డ్రైనేజీ కోసం రూ.9.80 లక్షలు, గోకుల్‌నగర్‌లో కమ్యూనిటీ హాల్ పెండింగ్ పనులకు రూ.46.50 లక్షల వ్యయంతో చేపట్టబోయే పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డివిజన్ అభివృద్ధికి పూర్తి సహాయ సహకారం అందిస్తానని, రాజకీయాలకు అతీతంగా అభివృద్ధి చేయనున్నట్లు తెలిపారు. అభివృద్ధి పనుల్లో నాణ్యత పాటించాలని కాంట్రాక్టర్లు, అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో డీఈ రూప, ఏఈ సవంత్రి, వర్క్ఇన్‌స్పెక్టర్ భిక్షపతి, రామారావు, కాలనీల అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు,

ఘనంగా టైలర్స్ డే

బట్టలు కుడుతూ ఉపాధి పొందుతున్న దర్జీలను ప్రభుత్వం ఆదుకోవాలని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అన్నారు. టైలర్స్ డే సందర్భంగా మల్లాపూర్ అంబేడ్కర్ భవన్‌లో శ్రీమాత గార్మెంట్ అసోసియేషన్ సభ్యుల అధ్వర్యంలో బుధవారం టైలర్ డే నిర్వహించారు.

ఆస్తి పన్ను మదింపు..!

- 2024–25 ఆర్థిక సంవత్సరంలో నూతన విధానం అమలుకు చర్యలు
- శివారు 29 పురపాలికల్లో వ్యవసాయేతర ఆస్తుల విలువలు సవరించి ఆస్తి పన్ను ఖరారుపై కసరత్తు
- సమాచారం సేకరించే పనుల్లో అధికారుల నిమగ్నం

పురపాలికల్లో ఆస్తి పన్ను లెక్కింపుపై ఆదేశాలు



సాక్షి, మేడ్చల్ జిల్లా: పురపాలికల్లో ఆస్తి పన్ను మదింపునకు ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. 2024–25 ఆర్థిక సంవత్సరంలో నూతన విధానం అమలు చేయనుంది. ఈ మేరకు పురపాలికల పరిధిలోని వ్యవసాయేతర ఆస్తుల విలువలను సవరించి ఆస్తి పన్ను విధిస్తారు. ఈ మేరకు ఎంత పన్ను పెరుగనుందో వివరాలు సేకరించే పనిలో పురపాలిక అధికారులు నిమగ్నమయ్యారు.

ఖాళీ స్థలాలకు పన్ను..

నగర శివారు పురపాలికల్లో చాలా మంది ప్లాట్లు కొనుగోలు చేసి నిర్మాణాలు చేపట్టకుండా వదిలేస్తున్నారు. ఇలా జిల్లాలోని అన్ని పురపాలికల్లో వేల సంఖ్యలో ఖాళీ (ప్లాట్లు)స్థలాలున్నాయి. వీటికి వీఎల్ (వేకెండ్ ల్యాండ్ టాక్స్) విధించాల్సి ఉంటోంది. పురపాలికల్లో అధికారులు పట్టించుకోకపోవడంతో వీటికి ఇప్పటి వరకు ఎలాంటి పన్నులు విధించని పరిస్థితి నెలకొంది. ఇక మీదట ఖాళీ స్థలాలకు వీఎల్ పన్ను చెల్లించమంటే కుదరదు. ఆస్తి విలువలో కనిష్ఠంగా 0.05, గరిష్ఠంగా 0.20 శాతం పన్ను ఖరారు చేయనున్నారు. ఖాళీ స్థలాల్లో భవిష్యత్తులో ఇళ్ల నిర్మాణానికి అనుమతి తీసుకోవాలంటే.. వీఎల్ పన్ను రశీదును జత చేయాల్సి ఉంటోంది. పలు పురపాలికల్లో నిధులు లేకపోవడంతో తాత్కాలిక ఉద్యోగుల వేతనాలు, ఇతర ఖర్చులు, అభివృద్ధి పనులకు ఇబ్బందిగా మారుతోంది. ఆస్తి పన్ను ద్వారా వచ్చే ఆదాయంతో వేతనాలతో పాటు అభివృద్ధి పనులు చేపట్టే అవకాశం ఉంది. మార్చి 31వ తేదీ నాటికి పురపాలికల్లో ఆస్తి పన్ను మదింపు ప్రక్రియ పూర్తి చేసి కొత్త పన్ను విధానం అమలు చేసేలా కసరత్తు చేస్తున్నట్లు మున్సిపల్ అధికార వర్గాలు పేర్కొంటున్నాయి.

ఆస్తి పన్ను నిబంధనలు ఇలా..

నగర శివారు మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా, రంగారెడ్డి జిల్లాల్లో 29 పురపాలక సంఘాలు ఉన్నాయి. 2024–25 ఆర్థిక సంవత్సరంలో నివాస భవనాలకు భవన నిర్మాణ విలువలో కనిష్ఠంగా 0.10 శాతం, గరిష్ఠంగా 1 శాతం ఆస్తి పన్ను పెంచనున్నారు. వాణిజ్య భవనాలకు మార్కెట్ విలువలో కనిష్ఠంగా 0.25 శాతం, గరిష్ఠంగా 2 శాతం పన్ను పెరుగుతోంది. పురపాలక చట్టం ప్రకారం 75 గజాలలోపు ఉన్న భవనానికి ఆస్తి పన్ను పెంపు వర్తించదు. వీటితో పాటు చారిత్రక భవనాలు, ఆసుపత్రులు, పురపాలక భవనాలు, అనాథ, వృద్ధాశ్రమాలకు మినహాయింపు ఉంటోంది.

16వ వార్డులో సీసీ రోడ్డు పనులు ప్రారంభం


సీసీ రోడ్డు పనులను ప్రారంభిస్తున్న కౌన్సిలర్ ఉమానాగరాజు

మేడ్చల్: పట్టణంలోని 16వ వార్డులోని రాఘవేంద్రనగర్ కాలనీలో రూ.4లక్షలతో నిర్మిస్తున్న సీసీ రోడ్డు పనులను కౌన్సిలర్ ఉమానాగరాజు ప్రారంభించారు. నిర్మాణ పనులకు ఆమె పూజా కార్యక్రమాలు నిర్వహించి పనులను ప్రారంభించారు.ఎమ్మెల్యే మల్లారెడ్డి, చైర్ పర్సన్ దీపికనర్సింహ్మారెడ్డితో కలిసి వార్డు ను అన్ని రంగాలలో అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు.

ఈటల ఇంట్లో విందు రాజకీయం

మేడ్చల్: మండలంలోని పూడూర్ గ్రామ పరిధిలోని తన నివాసంలో బుధవారం పార్లమెంట్ నియోజక వర్గ పరిధిలోని వివిధ సెగ్మెంట్ బీజేపీ నాయకులకు బీజేపీ నేత ఈటల రాజేందర్ అల్పాహార విందు ఏర్పాటు చేశారు. అధిష్ఠానం మల్కాజ్‌గిరి ఎంపీ టికెట్ తనకే ఖరారు చేసిందని అధికారిక ప్రకటన త్వరలోనే వస్తుందని నాయకులకు చెప్పినట్లు విందుకు హాజరైన నాయకులు తెలిపారు.బీజేపీ మల్కాజ్‌గిరి టికెట్ బీజేపీ సీనియర్ నేత మురళీధర్‌రావు, విద్యావేత్త మల్క కోమురయ్య వంటి దిగ్గజ నేతలు ఆశిస్తుండటంతో ఈటల విందు ఏర్పాటు చేయడం నాయకులకు పరోక్షంగా తనకే టికెట్ అని చెప్పడం బీజేపీలో చర్చనీయాంశంగా మారింది.

సెయింట్ పీటర్స్ కళాశాలలో వైద్య శిబిరం


రక్తదానం చేస్తున్న విద్యార్థులు

మేడ్చల్ రూరల్: గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధి మైసమ్మగూడలోని సెయింట్ పీటర్స్ ఇంజనీరింగ్ కళాశాలలో ఎన్ఎస్ఎస్ క్లబ్ ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు. కార్యక్రమాన్ని కళాశాల సెక్రటరీ టీవీ రెడ్డి ప్రారంభించగా అనంతరం వైద్య సిబ్బంది దంత పరీక్షలు, క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించారు.రక్తదాన శిబిరంలో విద్యార్థులు,అధ్యాపకులు రక్తదానం చేశారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ సరోజారెడ్డి, ప్రిన్సిపాల్ శ్రీలత, పీఆర్వో రవిసుధాకర్, ఎన్ఎస్ఎస్ పీఓ రాజేశ్, అధ్యాపకులు,విద్యార్థులు పాల్గొన్నారు.

మున్సిపల్ అదనపు భవనం ప్రారంభం


మున్సిపల్ అదనపు భవనాన్ని ప్రారంభిస్తున్న చైర్ పర్సన్ వసుపతి ప్రణీత

కీసర: దమ్మాయిగూడ మున్సిపల్ ఆఫీస్ ఆవరణలో నూతనంగా నిర్మించిన అదనపు భవనాన్ని చైర్ పర్సన్ వసుపతి ప్రణీత శ్రీకాంత్ గౌడ్ బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మున్సిపల్ ఆఫీస్ కోసం కొత్తగా నిర్మించిన భవనాన్ని వినియోగంలోకి తెచ్చామన్నారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ మాదిరెడ్డి నరేందర్‌రెడ్డి, కమిషనర్ ఎస్.రాజమల్లయ్య, డీఈఈ బి.చిరంజీవులు పాల్గొన్నారు.

వికలాంగురాలిని చూసి చలించిన ఎమ్మెల్సీ

మేడ్చల్: తనకు రేషన్ కార్డు లేదని, పింఛన్ రావడం లేదని తన గోసను పెద్దలు పట్టించుకోవాలని మేడ్చల్ ప్రాంతానికి చెందిన ఓ దివ్యాంగురాలు నగరంలోని గాంధీభవన్‌కు వెళ్లడంతో అక్కడ ఆమెను చూసిన ఎమ్మెల్సీ, టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ మహేష్‌కుమార్ గౌడ్ చలించిపోయారు. మేడ్చల్ ప్రాంతానికి చెందిన తనుశ్రీ అనె దివ్యాంగురాలు గాంధీ భవన్ కు వెళ్లి అక్కడ తన భాధను చెప్పుకోవాలని ప్రయత్నిస్తుండగా అటు నుండి వెళుతున్న మహేష్‌కుమార్‌గౌడ్ ఆమెను చూసి ఆమె పక్కన మెట్ల పై కూర్చుని తనుశ్రీ సమస్య విన్నారు. తనకు పించన్ రావడం లేదని, తనకు రేషన్‌కార్డు లేదని తెలపగా ఆయన అధికారులతో అక్కడి నుండే మాట్లాడి తనుశ్రీ సమస్యను తీర్చాలని ఆదేశాలు జారీ చేశారు.


దివ్యాంగురాలు తనుశ్రీ తో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ మహేష్‌కుమార్ గౌడ్

నర్సింహారెడ్డి కళాశాలలో క్రీడోత్సవం


క్రీడోత్సవం కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న కళాశాల చైర్మెన్ మెడికల్ డైరెక్టర్

మేడ్చల్ రూరల్: గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధి మైసమ్మగూడలోని నర్సింహారెడ్డి ఇంజనీరింగ్ కళాశాలలో ఉత్కృష్ట పేరిట రెండు రోజుల పాటు నిర్వహించనున్న క్రీడోత్సవం బుధవారం ఘనంగా ప్రారంభమైంది. కార్యక్రమంలో శ్రీమేరు హాస్పిటల్స్ మెడికల్ డైరెక్టర్ నరేశ్, కళాశాల చైర్మెన్ నర్సింహ్మారెడ్డి, సెక్రటరి త్రిశూల్‌రెడ్డి పాల్గొని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు చిన్నతనం నుండే క్రీడల్లో పాల్గొనాలన్నారు. క్రీడలతో విద్యార్థుల్లో ఏకాగ్రత పెరుగుతుందని, రోగ నిరోధక శక్తి మెరుగుపడడంతో పాటు బుద్ధి వికాసం చెందుతుందన్నారు. క్రీడోత్సవంలో 40 కళాశాలలకు చెందిన 90 జట్లు పాల్గొనున్నట్లు కళాశాల పీడీ జెస్సీ రోనాల్డ్ తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ లోకనాథం, కరస్పాండెంట్ సంగీతరెడ్డి, ట్రెజరర్ త్రిలోక్‌రెడ్డి, డీన్ రామదాసు, సాక్ కన్వీనర్ శైలజరెడ్డి, అధ్యాపకులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

నాణ్యమైన విద్యుత్ అందిస్తాం

మేడ్చల్ రూరల్: విద్యుత్ వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ అందించడమే తమ ధ్యేయమని ట్రాన్స్‌కో సీజీఎమ్ సాయిబాబా అన్నారు. మేడ్చల్ సబ్‌డివిజన్ పరిధిలోని పారిశ్రామిక వాడలో బుధవారం సాయంత్రం 11 కేవీ ఫీడర్‌ను పూజలు చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యుత్ కొరత, లో ఓల్టేజీ సమస్య వంటి విద్యుత్ సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించి వినియోగదారులకు మెరుగైన సేవలు అందిస్తామని తెలిపారు. అనంతరం మేడ్చల్ సబ్ డివిజన్ కార్యాలయంలోని రికార్డులు పరిశీలించి సిబ్బంది పనితీరు, విద్యుత్ సరఫరా తీరు వంటి పలు వివరాలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఎస్ఈ శ్రీరాం మోహన్, శ్రీనాథ్‌రెడ్డి,ఏడీఈ, ఏఈ శశిధర్‌రెడ్డి ,సిబ్బంది పాల్గొన్నారు.

17వ డివిజన్ అభివృద్ధికి రూ.4.66 కోట్లు


అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న కార్పొరేటర్

బోడుప్పల్: 17వ డివిజన్ పరిధిలో గడిచిన నాలుగేళ్లలో రూ.4.66 కోట్ల వ్యయంతో పలు అభివృద్ధి పనులు చేపట్టినట్లు కార్పొరేటర్ పోగుల నర్సింహారెడ్డి వెల్లడించారు. నాలుగేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా బుధవారం ఆయన మాట్లాడుతూ రూ.2.67 కోట్ల వ్యయంతో సీసీ రోడ్లు, ఎస్సీ శ్మశాన వాటికలో టాయిలెట్స్, శ్మశానవాటికలో పచ్చదనాన్ని పెంచేందుకు, ఇతర మరమ్మతులకు 38.30 లక్షలు, పార్కు ప్రహరీ గోడ నిర్మాణానికి, అభివృద్ధి కోసం, మొక్కలు పెంచడం కోసం రూ.74.90 లక్షలు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణం, డ్రైనేజీ పైపులైన్లు, స్ట్రామ్ వాటర్ డ్రైనేజీ కోసం, అవెన్యూ ప్లాంటేషన్ కోసం రూ.85.61 లక్షలు, సీసీ కెమెరాల ఏర్పాటుకు రూ.5 లక్షలు ఖర్చు చేసినట్లు వెల్లడించారు. డివిజన్‌లో అన్ని రకాల మౌలిక వసతులు కల్పిస్తూ ఆదర్శ డివిజన్‌గా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నట్లు వెల్లడించారు. ఇప్పటికే డివిజన్ ప్రజలకు తాగునీరు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, రోడ్లు, పారిశుద్ధ్యానికి అధిక ప్రాధాన్యం ఇచ్చినట్లు తెలిపారు. డివిజన్‌లో మిగిలిపోయిన పనులను త్వరితిగతిన పూర్తి చేసేందుకు కృషి చేస్తున్నట్లు ఆయన వెల్లడించారు.

రూ.60 లక్షలతో సీసీ రోడ్లకు శంకుస్థాపన

ఉప్పల్: ఉప్పల్ డివిజన్ వెంకటేశ్వర కాలనీలో రూ.60 లక్షల అంచనా వ్యయంతో నిర్మిస్తున్న సీసీ రోడ్డు పనులకు బుధవారం కార్పొరేటర్ మందుముల రజిత పరమేశ్వర్‌రెడ్డి స్థానికులతో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ డివిజన్‌లో ఎక్కడ ఏ సమస్య ఉన్నా స్వయంగా తన దృష్టికి తీసుకురావాలని కోరారు. మోడల్ డివిజన్‌గా తీర్చిదిద్దడానికి అందరూ సహకరించాలని కోరారు. కార్యక్రమంలో డీఈ నిఖిల్‌రెడ్డి, కాలనీ అధ్యక్షుడు సతీష్‌గౌడ్, జగన్, శ్రీధర్, విజయ్, భాస్కర్, కుమార స్వామి తదితరులు పాల్గొన్నారు.


సీసీ రోడ్డుకు శంకుస్థాపన చేస్తున్న కార్పొరేటర్ రజిత పరమేశ్వర్ రెడ్డి

అక్రమ కట్టడాల కూల్చివేత


అనుమతులు లేని భవనం కూల్చివేస్తున్న సిబ్బంది

మేడ్చల్: పట్టణ పరిధిలో అనుమతులు లేకుండా అక్రమంగా నిర్మిస్తున్న కట్టడాలను మున్సిపల్ అధికారులు బుధవారం కూల్చివేశారు. మున్సిపల్ టౌన్ ప్లానింగ్ అధికారులు దాడులు చేసి అక్రమ భవనాలను గుర్తించి వాటిని కూల్చివేశారు.బస్‌డిపో ఎదుట అనుమతులు లేకుండా అదనపు స్లాబ్ వేయడంతో బ్రేకర్లు పెట్టి స్లాబ్ ను కూల్చివేశారు. అనుమతులు లేకుండా భవణాలు నిర్మిస్తే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని అధికారులు తెలిపారు. కార్యక్రమంలో కమిషనర్ నాగిరెడ్డి, టీపీఎస్ రాధాకృష్ణ రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

నర్సరీని కాపాడాలని వినతి

ఘట్‌కేసర్: మున్సిపాలిటీ పదో వార్డులోని నర్సరీ స్థలాన్ని అన్యాక్రాంతం కాకుండా రక్షించాలని స్థానిక కౌన్సిలర్ శశికళ దేవేందర్ బుధవారం మున్సిపల్ కమిషనర్ పావనీజంగయ్య, కమిషనర్ సాబేర్ అలీకి వినతి పత్రం అందజేశారు. రూ. 22 లక్షలతో రెండు బోర్లు వేయించి నర్సరీని అభివృద్ధి చేశామని, ఓ ప్రైవేటు వ్యక్తి కబ్జాయత్నంలో భాగంగా నర్సరీని మాయం చేశాడని ఫిర్యాదులో తెలిపారు. దీనిపై సమగ్ర విచారణ జరిపి నర్సరీ స్థలాన్ని కాపాడాలని కోరారు.


వినతి పత్రం అందజేస్తున్న కౌన్సిలర్ శశికళదేవేందర్

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి


రోడ్డు ప్రమాదంలో మరణించిన వెంకటలక్ష్మి

మేడ్చల్ రూరల్: ద్విచక్ర వాహనాన్ని అతివేగంగా వస్తున్న టిప్పర్ వెనుకనుండి ఢీ కొనడంతో ఓ మహిళ మృతి చెందిన సంఘటన మేడ్చల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ మురళీధర్ తెలిపిన మేరకు.. కామారెడ్డి జిల్లా దోమకొండకు చెందిన అయ్యవారి వెంకటలక్ష్మి(55) కుటుంబంతో కలిసి గత కొంత కాలంగా మేడ్చల్ పట్టణంలోని కిందిబస్తీలో నివాసం ఉంటూ కండ్లకోయలోని సీఎంఆర్ కళాశాలలో స్వీపర్‌గా పనిచేస్తుంది. ఆమె కుమారుడు కరుణాకర్ ప్రైవేట్ ఉద్యోగం చేస్తున్నాడు. బుధవారం ఉదయం విధులకు హాజరయ్యేందుకు వెంకటలక్ష్మి, కుమారుడు కరుణాకర్ తమ ద్విచక్ర వాహనంపై సుతారిగూడ నుండి సీఎంఆర్ కళాశాల వైపు ఓఆర్ఆర్ సర్వీస్ రోడ్డులో వెళ్తుండగా అదే సమయంలో వెనుకనుండి వేగంగా వచ్చిన టిప్పర్ లారీ వీరి బైక్‌ను ఢీకొట్టింది. దీంతో బైక్‌పై ఉన్న ఇద్దరు కిందపడడంతో వెంకటలక్ష్మి అక్కడికక్కడే మృతి చెందగా కరుణాకర్‌కు తీవ్ర గాయాలపాలయ్యాయి. మేడ్చల్ పోలీసులు క్షతగాత్రుడిని చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించగా మరణించిన వెంకటలక్ష్మి మృతదేహాన్ని గాంధీ మార్చురీకి తరలించారు.

అందరూ ప్రశాంత జీవితాన్ని గడపాలి


స్వామి వేడుకల్లో భక్తులు

బోడుప్పల్: సమాజంలో ప్రతి ఒక్కరూ దైవచింతన కలిగి ప్రశాంత జీవితాన్ని గడపాలని పన్నాల కృష్ణారెడ్డి అన్నారు. బోడుప్పల్ పన్నాల రవీందర్‌రెడ్డి కాలనీలోని శ్రీకృష్ణ దేవాలయంలో బుధవారం నిర్వహించిన సుదర్శన నారసింహ హోమం కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐదు రోజులుగా సప్తాహ్నిక పంచ కుండాత్మక పుష్కర బ్రహ్మోత్సవాలను వైభవంగా నిర్వహిస్తున్నామని, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొననున్నట్లు వెల్లడించారు. వచ్చేనెల 2వ తేదీన జరిగే వసంతోత్సవం, శ్రీపుష్ప యాగానికి శ్రీత్రిదండి చిన్న జీయర్‌స్వామి ముఖ్య అతిథిగా హాజరవుతున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకులు చక్రవర్తుల సద్గుణాచార్యులు, అంజి, భక్తులు పాల్గొన్నారు.

వైభవంగా శివస్వాముల పూజ



మల్లాపూర్: న్యూభవానీనగర్‌లోని గురుస్వాములు బుసిరెడ్డి వెంకట్‌రెడ్డి, విజయలక్ష్మి దంపతుల ఆధ్వర్యంలో బుధవారం శివపూజ చేశారు. శివనామస్మరణతో ఆ ప్రాంగణం అంతా మార్మోగింది. కార్యక్రమంలో బుసిరెడ్డి కిరణ్‌కుమార్‌రెడ్డి, మహేందర్‌గౌడ్, జైపాల్‌రెడ్డి, గోపాల్‌స్వామి, నర్సింహస్వామి, తిరుపతి స్వామి, బీజేపీ డివిజన్ ప్రధాన కార్యదర్శి ముత్యంరెడ్డి, ధర్మారెడ్డి పాల్గొన్నారు.

మైనంపల్లికి సన్మానం

అల్వాల్: నేరేడ్‌మెట్ ముత్యాలరావు కో–ఆపరేటివ్ సొసైటీ అధ్యక్షులు డీఎల్ఎన్ రెడ్డి, సభ్యులు బుధవారం మల్కాజిగిరి మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావును మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు సొసైటీ సభ్యులను సత్కరించారు. కార్యక్రమంలో ముత్యాలరావు కో–ఆపరేటివ్ సొసైటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ ఉద్యోగులను రప్పించాలని వినతి

మల్కాజిగిరి: అంతరాష్ట్ర బదిలీలు చేపట్టిన తర్వాత మిగిలిపోయిన పోస్టుల్లో జిల్లా, జోనల్, మల్టీ జోనల్ స్థాయిలో ఏపీలో పనిచేస్తున్న తెలంగాణ స్థానికత ఉన్న ఉద్యోగులను రప్పించాలని రాష్ట్ర ప్రభుత్వ సలహాదారుడు వేం.నరేందర్‌రెడ్డికి అసోసియేషన్ తరపున వినతిపత్రం అందజేశారు. సంఘం నాయకులు డాక్టర్ ఆర్.శ్రీనివాస్, రమేష్ మాట్లాడుతూ రాష్టం ఏర్పడి పది సంవత్సరాలు పూర్తవుతున్నా ఇప్పటికీ అక్కడ ఉద్యోగం చేస్తుండటం వలన ఉద్యోగులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా నూతనంగా ఏర్పడిన ప్రభుత్వం, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చొరవ చూపి ఉద్యోగులకు న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశామన్నారు.